RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



4 లో గణనాథుని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :196 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 13 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



## ప్రజల నమ్మకాన్ని పొందాం...

# నిలబెట్టుకుంటాం





- ఎంతో చేశాం... మరింతగా అభివృద్ధి చేస్తాం - కేంద్ర సాయాన్ని, ప్రధాని మోదీ చేయూతను మరువలేం
- మేనిఫెస్టో అమలుపై చర్చకు సిద్ధం - కూటమిది పాజిటివ్ పాలిటిక్స్... గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్
- నాడు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు... నేడు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- రాజధానిపై మూడు ముక్కలాట...మావిగనో...? వాటికనో...?
- ఎమ్మెల్యేలు ప్రజా సేవకులే కానీ పెత్తందారులు కాదు - ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టను... చర్యలుంటాయ్
- 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి



**తిరుపతి, సింధూరదర్శిని:** 2024 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గెలుపుగా కాకుండా... బాధ్యతగా భావిస్తూ పాలన మొదలు పెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన కొనసాగిస్తామని సీఎం వెల్లడించారు. శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గం దామినీడులో రెండేళ్ల పాలనపై జరిగిన విజయోత్సవ సభకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం పేరుతో చేపట్టిన ఈ సభలో పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సుపరిపాలనలో భాగంగా అందిస్తున్న సేవలను సభావేదికగా చెప్పారు. ఇక రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటున్న కేంద్రం.. చేయూతనందిస్తున్న ప్రధాని మోదీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. రెండేళ్ల కాలంలో డబుల్ ఇంజిన్ సర్కార్ చేసిన ప్రగతిని వివరించడంతోపాటు... రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపైనా అప్రమత్తంగా ఉండాలని సీఎం హెచ్చరించారు. ఇక ప్రజా ప్రతినిధులు పెత్తందార్లుగా కాకుండా.. ప్రజా సేవకులుగా మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. ప్రధాని మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ఇచ్చిన పిలుపునకు మద్దతు పలికారు. 57 శాతం ఓట్ షేర్ తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. 164 సీట్లతో ఎన్డీఏకు అధికారాన్ని అందించారు. 2024 ఫలితాలను గెలుపుగా కాదు రాష్ట్ర మిగతా 2లో...

## కాంగ్రెస్‌కు షాక్..

- మీనాక్షి నటరాజన్ అంశంలో జోక్యానికి సుప్రీం నో
- కేసు ఉందన్న కారణంతో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ
- రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టుకు కాంగ్రెస్
- జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టీకరణ
- ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని సూచన



**సింధూరదర్శిని:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల వ్యవహారంలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన తర్వాత న్యాయస్థానం నేరుగా జోక్యం చేసుకునే అవకాశం చాలా పరిమితమని స్పష్టం చేసింది. జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ ఏఎస్ చంద్రుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను మిగతా 2లో...

## భారతీయ సిబ్బంది నౌకపై దాడి..

## అమెరికాకు భారత్ మరోసారి గట్టి నిరసన

- 48 గంటల్లో రెండోసారి అమెరికా దౌత్యాధికారిని పిలిపించిన భారత్
- ఒమన్ తీరంలో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి
- గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికుల మృతి
- చర్చలు, దౌత్య పరిష్కారాల ద్వారానే ఉద్రిక్తతలు తగ్గాలని స్పష్టం



**సింధూరదర్శిని:** ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. నిన్న జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగశాఖ మిగతా 2లో...

## ఎంజీఆర్, జయ బాటలో సీఎం విజయ్

### కొల్లూరు మూకాంబిక అమ్మవారికి వెండి కత్తి సమర్పణ

- కొల్లూరు మూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న తమిళనాడు విజయ్
- ఆలయానికి 1.6 కిలోల వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పణ
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఇదే ఆయన తొలి రాష్ట్రేతర పర్యటన



వివరాలు 2 లో

## టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదల

- ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం జరిగిన పరీక్ష
- పరీక్షకు దాదాపు 56,000మంది విద్యార్థుల హాజరు
- అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ర్యాంక్ కార్డులు
- జూలై నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ




**హైదరాబాద్, సింధూరదర్శిని:** తెలంగాణలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. మిగతా 2లో...

## విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం

- జగన్ ట్రూ-అప్ విధానాన్ని ట్రూ-డౌన్‌గా మార్చిన ఘనత కూటమిది
- గత రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు
- వచ్చే మూడేళ్లలోనూ విద్యుత్ చార్జీల పెంపు ఉండదు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, సింధూరదర్శిని:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అదే విధంగా వచ్చే మూడేళ్లలోనూ ఎటువంటి విద్యుత్ ఛార్జీల పెంపులు, అదనపు భారాలు ఉండవని ఆయన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను సర్వ నాశనం చేసిందని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. ఆర్థికంగానూ దెబ్బ తీసి విద్యుత్ వ్యవస్థ మనుగడకే ముప్పు తెచ్చారన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికతతో రెండేళ్ల వ్యవధిలోనే విద్యుత్ శాఖను గాడిలో పెట్టామన్నారు. కూటమి మిగతా 2లో...

## లక్నో-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- లక్నో నుంచి ఢిల్లీ వెళ్లే ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- విమానం టాయిలెట్‌లో టిష్యూ పేపర్‌పై రాసి ఉన్న 'బాంబ్' నోట్
- ప్రయాణికులను దించివేసి, విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు
- ఇది కేవలం అబద్ధపు బెదిరింపు అని నిర్ధారణ



లక్నో నుంచి ఢిల్లీ బయలుదేరాల్సిన ఇండిగో విమానంలో శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, విమానంలోని టాయిలెట్‌లో ఒక టిష్యూ పేపర్‌పై 'బాంబ్' అని రాసి ఉండటాన్ని సిబ్బంది గమనించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు తక్షణమే విమానాన్ని నిలిపివేశారు. లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉదయం 10:45 గంటలకు ఈ విమానం ఢిల్లీకి బయలుదేరాల్సి ఉంది. సుమారు 180 మంది ప్రయాణికులతో టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఈ ఘటన వెలుగుచూసింది. భద్రతా నిబంధనల (ప్రోటోకాల్) మిగతా 2లో...

# కాంగ్రెస్‌కు షాక్..

(మొదటిపేజీ తరువాయి)

విచారించింది. నామినేషన్ తిరస్కరణపై అసంతృప్తి ఉంటే ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించడమే సాధారణంగా అందుబాటులో ఉన్న మార్గమని కోర్టు వ్యాఖ్యానించింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయం తప్పుగా ఉన్నప్పటికీ ఆ దశలో కోర్టు జోక్యం చేసుకోవడం సాధారణం కాదని పేర్కొంది. దీంతో నటరాజన్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ చేసిన వాదనలను కోర్టు అంగీకరించలేదు. మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను, తెలంగాణలో నమోదైన ఓ కేసు వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న కారణంతో రిటర్నింగ్ అధికారి తిరస్కరించిన విషయం తెలిసిందే. అయితే ఆ కేసులో కేవలం నోటీసులు మాత్రమే జారీ అయ్యాయని, దర్యాప్తు లేదా ఛార్జిషీట్ దశకు వెళ్లలేదని కాంగ్రెస్ వాదిస్తోంది. అలాంటి పరిస్థితిని పూర్తి స్థాయి క్రిమినల్ కేసుగా పరిగణించి నామినేషన్‌ను తిరస్కరించడం సరికాదని సింఘ్వీ కోర్టుకు వివరించారు.

# టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలతో పాటు అభ్యర్థుల ర్యాంకు కార్డులను కూడా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 13,14 తేదీల్లో ఈ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 56,000 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష అనంతరం మే 29న ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు, తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను icet.tgche.ac.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ర్యాంకు కార్డులో సెక్షన్ల వారీగా సాధించిన మార్కులు, మొత్తం నార్మలైజ్డ్ స్కోర్, ర్యాంకు వివరాలను పొందుపరిచారు. జూలై నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది.

# భారతీయ సిబ్బంది నౌకపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సెట్టెబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

# లక్నో-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం విమానాన్ని వెంటనే ఐసోలేషన్ బేకు తరలించారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, బాంబ్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్ సహాయంతో విమానాన్ని, ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంటల తరబడి నిర్వహించిన సోదాల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లేదా అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు వెల్లడించారు. అది కేవలం నకిలీ బెదిరింపు మాత్రమేనని నిర్ధారించారు. ఈ ఘటనపై ఇండిగో ఎయిర్‌లైన్స్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. "లక్నో-ఢిల్లీ విమానంలో భద్రతాపరమైన ముప్పును గుర్తించిన వెంటనే నియంత్రణ అధికారులకు సమాచారం అందించాం. ప్రయాణికుల భద్రతే మాకు అత్యంత ప్రాధాన్యత. ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నాం" అని సంస్థ పేర్కొంది.

ఈ ఆకస్మిక ఘటనతో ప్రయాణికులు గంటల పాటు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు అది ఉత్తుత్తి బెదిరింపు మాత్రమేనని తేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, టాయిలెట్‌లో 'బాంబ్' అని రాసిన వ్యక్తిని గుర్తించేందుకు అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు.

# ప్రజల నమ్మకాన్ని పొందాం... నిలబెట్టుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

పునర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించాం. పాలకులుగా కాకుండా సేవకులుగా పని చేస్తున్నాం. అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లో సంక్షోభం-వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం రూ.10 లక్షల కోట్ల అప్పుతో ముగిసింది. కేంద్ర పథకాలను, సాగునీటి పథకాలను నిర్వీర్యం చేశారు. ఇన్వెస్టర్లను వెంటాడి వేటాడి తరిమేశారు. యువత భవిష్యత్తును దెబ్బ తీశారు. ప్రశ్నించిన ప్రజలను వేధించారు. నన్ను అక్రమంగా జైల్లో పెట్టారు. పవన్ కల్యాణ్ ను ఇబ్బందులు పెట్టారు. మేం కుంగిపోకుండా, వెనకడుగు వేయకుండా పనిచేసి ప్రజల కోసం నిలబడ్డాం. రాష్ట్ర దుస్థితిని చూసి భయపడకుండా 7 శ్వేతపత్రాలు విడుదల చేసి ప్రజలకు వాస్తవ విషయాలు తెలియచేసాం. ప్రజలు చూపిన విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్ గెలిచింది. రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు విజ్ఞత చూపారు. ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెట్టాం. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**గత ప్రభుత్వంలో ఎన్నో అవకాశాలను పోగొట్టుకున్నాం**

"2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల పాటు ఏపీ అవకాశాల్ని పోగొట్టుకుంది. విధ్వంసాన్ని సరి చేసేందుకు ఒక్కో అడుగూ ముందుకు వేస్తున్నాం. ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్సవ సభను నిర్వహించుకుంటున్నాం. విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్పే గుండె ధైర్యం ఎన్డీఏ ప్రభుత్వానికి ఉంది. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం. ఇచ్చినట్టే పాలన అందిస్తున్నాం. సూపర్ సిక్స్ తో పాటు మేనిఫెస్టోలో హామీల అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సాధించాం. ఎన్టీఆర్ భరోసా ద్వారా రూ.65 వేల కోట్ల పెన్షన్లు, తల్లికి వందనం ద్వారా చిన్నారులకు చదువు చెప్పిస్తున్నాం. స్త్రీశక్తి ద్వారా 71 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించాం. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి రూ.20 వేలు ప్రతీ రైతుకూ అందించాం. 24 గంటల్లోనే ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లిస్తున్నాం. గీత కార్మికులు, వడ్డెర్లు, అర్చకులు, ఇమామ్ లు, మౌజన్లు ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నాం. ఎస్సీ,ఎస్టీ, బీసీల సహా అందరికీ సబ్సీడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. విద్య వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ సంజీవని ప్రాజెక్టు చేపట్టాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది టీచర్ పోస్టుల భర్తీతో పాటు 5757 మంది కానిస్టేబుళ్లను కూడా నియమించాం. ఉద్యోగులకు 23 నెలల్లో రూ.21 వేల కోట్ల బకాయిలు చెల్లించాం. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. ఎమ్మార్వో ఆఫీసు, ఆస్పత్రి, మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టుకు పెట్టారు. యావత్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన వ్యక్తికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత ఉందా..? మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలు ఆట ఆడిన వ్యక్తులకు ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను, అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నాం. 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. గత పాలకుల హయాంలో పెట్టుబడి దారులు రాష్ట్రం నుంచి పారిపోయారు. మళ్లీ ఏపీ బ్రాండ్ పునరుద్ధరించి పెట్టుబడుల్ని, ప్రాజెక్టుల్ని సాధిస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. వివిధ పారిశ్రామిక పాలసీల ద్వారా పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని కల్పించాం... అందుకే పెట్టుబడులు వస్తున్నాయి. కేవలం 36 రోజుల్లోనే రాయలసీమలోని పుట్టపర్తికి 5వ జనరేషన్ ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజెక్టుకు అనుమతులిచ్చాం. రాయలసీమ ఇక హార్టీ కల్చర్ హబ్. ఇక్కడికే స్పేస్, డ్రోన్, డిఫెన్సు పరిశ్రమలు వస్తున్నాయి. తిరుపతి జిల్లాలో రాయల్ ఎన్ ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ ఏర్పాటు అవుతోంది. కర్నూలు జిల్లా జొన్నగిరిలో బంగారు గని నుంచి తవ్వకాలు ప్రారంభం అవుతాయి. గత పాలకులు చేసిన విధ్వంసం నుంచి ఇప్పుడు రాష్ట్రాన్ని నిలబడుతున్నాం. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ అందించాం. ఏపీని అగ్రస్థానంలో... అందరికీ ఆదర్శంగా నిలిపేందుకు అంతా కలిసి కృషి చేయాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు.

**అభివృద్ధి చేస్తుంటే... అడుగడుగునా అడ్డుకుంటున్నారు**

"రాయలసీమ ప్రాంతంలోని వివిధ ఖనిజాల ద్వారా వేర్వేరు పరిశ్రమలు వస్తాయి. 100 రోజుల్లోనే హంద్రీ-నీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తెచ్చాం. కల్యాణి డ్యామ్ కూడా పూర్తి చేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్లు తెస్తాం. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి అపవిత్రం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించింది. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదు. కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసింది. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల లక్ష్యం. విశాఖకు, గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి ఐటీ కంపెనీలు వస్తే, అమరావతికి క్వాంటం వ్యాలీ వస్తోంది. ఏపీకి పరిశ్రమలు రావాలి... మన రాష్ట్రం పురోగతి సాధించాలి. మన యువతకు ఉద్యోగాలు రావాలి. అందుకే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా మన యువతకు కల్పిస్తున్నాం. అడ్డగోలుగా జిల్లాలను విభజించారు. దానిని సరిచేసి మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశాం. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రీసర్వే ప్రక్రియ ద్వారా భూ వివాదాలకు చెక్ చెబుతున్నాం. భూ రికార్డులను ప్రక్షాళన చేసేలా కార్యక్రమం చేపడుతున్నాం. దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామంలో భూ వివాదాలకు చెక్ పెట్టాం. చెత్త పన్ను రద్దు చేయటంతో పాటు రాష్ట్రంలో చెత్తను, పరిపాలనలో చెత్తను కూడా తొలగిస్తున్నాం. పరిపాలనకు అడ్డంకులు కల్పించే కొన్ని పాత చట్టాలను రద్దు చేసి పాలనా సమర్థత పెంచుతున్నాం. విద్యుత్ ఛార్జీలు పెంచలేదు. తొలిసారి ట్రూ డౌన్ చేసి విద్యుత్ ఛార్జీలు తగ్గించాం. రూ.4,668కోట్ల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించింది. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2047 స్వర్ణాంధ్ర దిశగా ఏపీ ముందుకు వెళుతుంటే గొడ్డలి పార్టీ వెనక్కు లాగే ప్రయత్నం చేస్తోంది. పూర్తి పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటుంటే లేని పోని దుష్ప్రచారం ఆ పార్టీ చేస్తోంది. గొడ్డలి పార్టీ ఫేక్ న్యూస్ తో విష ప్రచారాలు చేస్తోంది. మద్య నిషేధం చేసి ఓటు అడుగుతానన్న వ్యక్తి ఏం చేశారో అందరికీ తెలుసు. జే బ్రాండ్లతో ప్రజారోగ్యాన్ని దెబ్బతీశారు. మహిళల మంగళసూత్రాలు తెంచారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి అధికారంలో ఎన్ని వారాలు ఉన్నారో అందరికీ తెలుసు. జాబ్ క్యాలెండర్ అని ఘనంగా ప్రకటించి ఒక్కసారి కూడా విడుదల చేయలేక పోయింది గొడ్డలి పార్టీ. అమరావతిపై ఊసరవెల్లి రాజకీయాలు చేశారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కల ఆటలాడారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు... అది మావిగనో వాటికనో..? వైసీపీ ఫేక్ న్యూస్ ను నమ్ముకుంటే... మేం ప్రజలను నమ్ముకున్నాం. ఫ్రస్ట్రేషన్ తో గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. కూటమిది పాజిటివ్ పాలిటిక్స్... గొడ్డలి పార్టీది పాయిజన్ పాలిటిక్స్. ప్రజా ప్రభుత్వానికి ప్రజలే ఫస్ట్, దేశం- రాష్ట్రమే కూటమి అజెండా. దేశంలో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే అభివృద్ధి ఆటోమేటిక్ గా జరుగుతుంది. తాము పెత్తందార్లు కాదు, ప్రజలకు సేవకులమనే విషయాన్ని ప్రతి ఒక్క ఎమ్మెల్యే గుర్తుంచుకోవాలి. ఎన్డీఏ కూటమిపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఓ బ్లూ ప్రింట్ మన దగ్గర ఉంది. రెండేళ్ల క్రితం ఇదే రోజు సుపరిపాలనలో ఓ హంబుల్ బిగినింగ్ చేశాం. మేనిఫెస్టో అమలుపై చర్చించడానికి నాతో పాటు ఎన్డీఏ కూటమిలోని ప్రతీ కార్యకర్తా సిద్ధమే. నా దేశం - నా బాధ్యత అనే ఆలోచనతోనే మనం అంతా పని చేయాలి. ప్రజా ప్రభుత్వం అనుక్షణం ప్రజల గురించే ఆలోచిస్తుంది. అభివృద్ధికి, సుపరిపాలనకు పునరంకితం అయ్యేలా సంకల్పం తీసుకుందాం. త్వరలోనే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించిన ట్రాక్ రికార్డు ప్రజా ప్రభుత్వానిది విధ్వంసం చేసిన రికార్డు గొడ్డలి పార్టీది."అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు.

**దేశానికి దిశా నిర్దేశంలా మోదీ 12 పాలన**

"రాష్ట్రానికి కేంద్రం సహకారం అందిస్తోంది. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా వివిధ అంశాల్లో కేంద్రం అండగా నిలిచింది. ప్రధానిగా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్నందుకు ఆయనకు అభినందనలు. మోదీ 12 ఏళ్ల పాలన దేశాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేలా చేసింది.. భవిష్యత్తుకు పునాదులు వేసింది. వరుసగా మూడు సార్లు మోదీకి మద్దతుగా నిలవటం వల్లే దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్తోంది. 25 కోట్ల మంది పేదలు పేదరికం నుంచి విముక్తి కల్పించిన నేత ప్రధాని మోదీ. 1.46 లక్షల కిలోమీటర్ల జాతీయ రహదారులు, 160 ఎయిర్ పోర్టులు నిర్మించారు. చంద్రయాన్, గగన్ యాన్ లాంటి ప్రాజెక్టులు దేశప్రతిష్టను పెంచాయి. ఆపరేషన్ సింధూర్ సైనిక శక్తిని ప్రపంచానికి చాటింది. పశ్చిమాసియాలో యుద్ధంతో రకరకాల ఇబ్బందులు వస్తున్నాయి. ప్రధాని మోదీ చేపట్టిన చర్యల కారణంగా అతి తక్కువ ద్రవ్యోల్బణం కలిగిన దేశంగా భారత్ ఉంది."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందాం: లబ్దిదారులు**

2 ఏళ్ల పాలన విజయోత్సవ సభ సందర్భంగా వివిధ పథకాల లబ్దిదారులు తాము పొందిన లబ్దిని సభా వేదిక మీద నుంచి వివరించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా తాను పొందిన లబ్దిని.. తన అనుభవాన్ని ఉష అనే యువతి వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో తనకు కలిగిన మేలును చంద్రబాబు అనే రైతు చెప్పారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం నిధులు తన ఖాతాలో జమ అయ్యాయని.. చక్కగా చదువుకుంటున్నారని తల్లికి వందనం లబ్దిదారు పులిచర్ల నాగమ్మ సంతోషంగా చెప్పారు. తనకు కూటమి ప్రభుత్వం ఇల్లును ఇచ్చిందని నాగమ్మ సభా వేదికగా వెల్లడించింది. రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. 2 ఏళ్ల కాలంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, ప్రాంతాల వారీగా జరిగిన అభివృద్ధిని అద్దం పట్టేలా వీడియోను రూపొందించారు. కేంద్రం అందించిన సాయాన్ని... ప్రధాని మోదీ అందిస్తోన్న సహకారాన్ని వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎలా పని చేస్తున్నారనే విషయాలను క్రోడీకరిస్తూ వీడియో రూపకల్పన చేశారు. ఈ సభకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు హాజరయ్యారు.

# ఎంజీఆర్, జయ బాటలో సీఎం విజయ్



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ శుక్రవారం నాడు కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొల్లూరు మూకాంబికా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, తన మొక్కులో భాగంగా 1.6 కిలోల బరువున్న వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరపున విజయం సాధించి, మే నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ రాష్ట్రం వెలుపల పర్యటించడం ఇదే తొలిసారి. ఢిల్లీ నుంచి విమానంలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సుమారు 125 కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన విజయ్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, దాదాపు 20 నిమిషాల పాటు గర్భగుడిలో గడిపి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గతంలో తమిళనాడు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎం.జి. రామచంద్రన్ (ఎంజీఆర్), జానకీ రామచంద్రన్, జె. జయలలిత సైతం ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకోవడం ఒక సంప్రదాయంగా వస్తోంది. వారి బాటలోనే విజయ్ కూడా అమ్మవారిని దర్శించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయ్ పర్యటన సందర్భంగా మంగళూరు విమానాశ్రయం, కొల్లూరు ఆలయ పరిసరాల్లో కర్ణాటక, తమిళనాడు పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన పర్యటన పూర్తిగా ఆధ్యాత్మికమైనదని, ఇందులో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు లేవని అధికారులు వెల్లడించారు. దర్శనం అనంతరం విజయ్ తిరిగి చెన్నైకు బయలుదేరి వెళ్లారు.

# జగన్ తప్పుడు ఆరోపణల గుట్టు బట్టబయలైంది: నారా లోకేశ్

అమరావతి, సింధూరదర్శిని:

మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీ విషయంలో తప్పుడు ప్రచారం చేసి, అభ్యర్థులను తప్పుదోవ పట్టించారని, దీనికి గాను ఆయన ఆంధ్రప్రదేశ్ యువతకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. జగన్ చేసిన ప్రతి ఆరోపణను వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించామని ఆయన అన్నారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. "జగన్ రెడ్డి సృష్టించిన తప్పుడు ప్రచారం ఇప్పుడు పూర్తిగా బట్టబయలైంది. ఆయన చేసిన ప్రతి ఆరోపణను మేం వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించాం. మేము మొదటి నుంచి ఏం చెబుతున్నామో అదే నిజమని ఇప్పుడు రుజువైంది. మా వాదనను న్యాయస్థానాలు కూడా సమర్థించాయి. జగన్ చేసిన నిరాధార ఆరోపణలను కోర్టులు కొట్టివేశాయి. దీంతో ఈ నియామక ప్రక్రియలో మా నిజాయతీ మరోసారి నిరూపితమైంది. లక్షలాది మంది అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారిలో అనవసర ఆందోళన కలిగించిన ఆయన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతోంది. వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. ఇంత జరిగిన తర్వాత, రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టించినందుకు వైఎస్ జగన్ గారు వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇది మా డిమాండ్" అంటూ నారా లోకేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ నోట్ విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ట్రూ అప్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ట్రూ డౌన్‌గా మార్చి చరిత్ర సృష్టించిందన్నారు. విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపకుండా 13 పైసలు ట్రూ డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూనే వినియోగదారులపై అదనపు భారాన్ని మోపకుండా చర్యలు చేపడుతోందని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోళ్లను గణనీయంగా తగ్గించామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంప్రదాయేతర ఇంధన రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 6 లక్షల సోలార్ కనెక్షన్లను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వెల్లడించారు. అలాగే, ఆర్డీఎస్ఎస్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలు తగ్గించడంతో పాటు విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపర్చేందుకు పెద్ద ఎత్తున సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. దీనితో విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజ్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని స్పష్టం చేశారు.

# రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం సభలో వేమిరెడ్డి దంపతులు



నెల్లూరు (సింధూర దర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి లో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కూటమి నేతలు 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన బహిరంగసభలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత, మంత్రి నారాలోకేష్ , బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు సీఎం చంద్రబాబు నాయుడుని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌ని యువనేత నారా లోకేష్‌ని ప్రత్యేకంగా కలిశారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలోని పలు సమస్యలను ఎంపీ తెలిపారు. అలాగే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరునియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంభంధించి వారికి వివరించారు.

# అందరి సమిష్టి కృషితోనే నగరపాలక సంస్థకు ఐ.ఎస్.ఓ గౌరవం:కమిషనర్ వై.ఓ నందన్



నెల్లూరు (సింధూర దర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు నగరపాలక సంస్థ పౌర సేవలలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను పాటిస్తుందని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ మూడు విభాగాలలో ఉత్తమ ప్రతిభ సర్టిఫికెట్లను ప్రధానం చేసిందని, ఇలాంటి గౌరవం పొందడంలో ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అన్ని విభాగాల అధికారులతో పాటు నగర ప్రజల సమిష్టి కృషి ప్రధాన భూమిక వహించిందని కమిషనర్ వై.ఓ నందన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యాలయంలోనే కమిషనర్ చాంబర్లో ఒక వీడియో ప్రకటన ద్వారా సందేశాన్ని కమిషనర్ శుక్రవారం అందించారు. హెచ్.వై.ఎమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్స్ సంస్థ ద్వారా పూర్తిస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన అనంతరం సంతృప్తికర ఫలితాలు అందుకున్నాక ఆ సంస్థ నుంచి ఐ.ఎస్.ఓ 9001, ఐ.ఎస్.ఓ 14001, ఐ.ఎస్.ఓ 50001 సర్టిఫికెట్లను ఆ సంస్థ ఎం.డి శివయ్య ద్వారా పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి.నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాంసు శుక్లాల సమక్షంలో అందుకున్నామని కమిషనర్ తెలియజేశారు. ఐ.ఎస్.ఓ 9001 సర్టిఫికెట్ ను ఉత్తమ పౌర సేవలు, ఉత్తమ యాజమాన్య నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ తీరు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ, నిర్దేశించిన గడువులోపు ప్రజా ఫిర్యాదుల పరిష్కారం అంశాలపై లభించిందని తెలిపారు. ఐ.ఎస్.ఓ 14001 సర్టిఫికెట్ ను నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్ ద్వారా లెగసి వేస్ట్ క్లియర్ చేయడం, లెగసీ వేస్ట్ క్లియర్ ప్లాంట్లలో నూతనంగా ఎకో పార్కులను ఏర్పాటు చేయడం అంశాలకు లభించిందని వివరించారు.

ఐ.ఎస్.ఓ 50001 సర్టిఫికెట్ ను గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడం, సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యత కల్పించడం, అన్న క్యాంటీన్ లు, ఏ.సి బస్‌స్టాప్‌లు, నగరపాలక సంస్థ కార్యాలయాలలో సోలార్ ఎనర్జీ వినియోగించడం, నగరవ్యాప్తంగా విద్యుత్ ఆదా ఎల్ఈడి వీధి బల్బుల వినియోగం అంశాలలో సర్టిఫికెట్ సాధించామని కమిషనర్ ప్రకటించారు. నెల్లూరు నగరపాలక సంస్థ అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లను సాధించడంలో పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ లు రూప్ కుమార్ యాదవ్, సయ్యద్ తహసీన్, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారం ఎనలేనిదని కమిషనర్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు అందరూ తమ పరిధి మేరకు చేసిన కృషి ఫలితంగానే ఇంతటి గౌరవాన్ని సాధించామని కమిషనర్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలందరి సహకారంతో నగరపాలక సంస్థ అన్ని విభాగాల అధికారుల సమిష్టి కృషితో రానున్న రోజులలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో కూడా ఉత్తమ ర్యాంకును సాధించే దిశగా అడుగులేస్తున్నామని కమిషనర్ ఆకాంక్షించారు.



## బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

### ఆలయ చైర్మన్ కంటి రామ్మోహన్‌రావు

గూడూరు (సింధూరదర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు పట్టణంలోని రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 24.వ తేదీ నుండి వచ్చే నెల 4 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న 28.వ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహనపై పాలక మండలి సభ్యులతో కలిసి దేవస్థాన చైర్మన్ శ్రీకంటి రాంమోహనరావు దేవస్థానంను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు పేపల్ల అమరయ్య నాయుడు, మంగళపూరు గోపాల్, పర్వతాల నాగేంద్ర, మునికోటేశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు భార్గవ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం




గూడూరు( సింధూర దర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఏర్పాటయున్న సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో రోటరీ వేస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు పోచారెడ్డి ధనుంజయ రెడ్డి, సుమన్ కుమార్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, కసిరెడ్డి విజయ రాఘవరెడ్డిల జ్ఞాపకార్థం దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, సీనియర్ రొటేరియన్ శ్రీకంటి రామ్మోహనరావు, వాసు గౌడ్, సిహెచ్ గిరిబాబు, ఎం హరినాద్ రెడ్డి, బలరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌కేఆర్ ప్రిన్సిపాల్‌గా రాంప్రసాద్ రెడ్డి బాధ్యతలు



గూడూరు (సింధూరదర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రిన్సిపాల్ గా తన విధులు ప్రారంభించారు. గతంలో కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకుడిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసి పదోన్నతి పొంది కమిషనర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ప్రస్తుత ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా నూతన ప్రిన్సిపాల్‌కు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు, విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె.రాంప్రసాద్ మాట్లాడుతూ కళాశాల పూర్వ వైభవానికి అన్ని విధాలుగా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నందీశ్వరునికి ప్రదోష కాల వృషభార్చన

### ఆలయ సహాయక కమిషనర్ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి , చైర్మన్ అశోక్ రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం (సింధూరదర్శిని) 12జూన్ నెల్లూరుజిల్లా; బుచ్చిరెడ్డి పాలెం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం నందు బహుళ త్రయోదశి సందర్భంగా శుక్రవారం దేవస్థాన నందు కొలువై ఉన్న అధికార రాతి నందీశ్వరునికి ప్రదోష కాల వృషభార్చన ఆలయ అర్చకులు వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బుచ్చిరెడ్డిపాలెం వాస్తవ్యులు ఇప్పగుంట శరత్‌కుమార్‌రెడ్డి శారద దంపతులు ఉభయకర్తగా వ్యవహరించారు. ఈకార్యక్రమానికి భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు కీలుకుప్ప శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రణాళికలు రూపొందించాలి

### గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం కె వి శ్రీనివాసులు



నెల్లూరు (సింధూరదర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పర్యాటక మరియు వినోద సదుపాయాల అభివృద్ధి అవకాశాలను పరిశీలించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కె.వి. శ్రీనివాసులు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనిల్ కుమార్ అసిస్టెంట్ ఇంజినీర్లు )తో కలిసి చిల్డ్రన్స్ పార్క్ మరియు బోడిగాడితోట పార్కులను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెండు పార్కుల్లో వాటర్ స్పోర్ట్స్, అమ్యూజ్‌మెంట్ కార్యకలాపాలు, జిప్ లైనర్ ఏర్పాటు వంటి వినోద సౌకర్యాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మైపాడు రోడ్ డివైడర్లలో ఇటీవల ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను పరిశీలించి, మొక్కల నిర్వహణ, సంరక్షణ మరియు నీటి వినియోగాన్ని మరింత సమర్థవంతంగా చేపట్టేలా తగిన సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, హార్టికల్చర్ అధికారి సాయి నరసింహ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతనూతలపాడు, (సింధూరదర్శిని): మండల పరిధిలోని సంతనూతలపాడులోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మత్తులు కారణంగా మండలంలో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు సంతనూతలపాడు మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పి.గోపి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పి.గుడి పాడు, కొనగానివారిపాలెం, మిట్టమీదపాలెం, మండల కేంద్రమైన సంతనూతలపాడులో శనివారం ఉదయం 8 గంటల నుండి 10:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయ బడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు దీనిని గుర్తించవలసినదిగా మండల విద్యుత్‌అసిస్టెంట్ ఇంజనీర్ గోపి కోరారు.

## నెల్లూరు రైల్వేస్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### జీఎంకు ఎంపీ వేమిరెడ్డి ప్రతినిధి వినతి

నెల్లూరు ( సింధూర దర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జనరల్ మేనేజర్ (జీఎం) సందీప్ మాథూర్ శుక్రవారం నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయ ప్రతినిధి పెంచల రెడ్డి జీఎంను కలిసి రైల్వేశాఖకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని నివేదించారు. 2023లో ప్రారంభమై, ఇప్పటికే చాలా ఆలస్యమైన నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునికీ కరణ పనులను వేగవంతం చేయాలని, నియోజకవర్గ పరిధిలోని పలు రైల్వే క్రాసింగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీ కోరినట్లు తెలియజేశారు. బుచ్చిరెడ్డిపాళెం–ఊటుకూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 122, 128 లెవల్ క్రాసింగ్‌ల వద్ద నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జి రోడ్డు వెడల్పు 10 మీటర్లకు పెంచాలని కోరారు. కావలి పరిధిలో, 156 లెవల్ క్రాసింగ్ పాత రోడ్డు క్రాసింగ్ పాయింట్ వద్ద కొత్తగా ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు. దీంతో పాటు లెవల్ క్రాసింగ్ 143 (అల్లూరు రోడ్ – బిట్రగుంట) వద్ద 3.5 మీటర్ల ఎత్తు గల కంటైనర్లు వెళ్లేలా ట్విన్ బాక్స్ (రెండు దారులు ఉన్న) అండర్ బ్రిడ్జ్ నిర్మించాలని తెలిపారు. ముసునూరు లెవల్ క్రాసింగ్ 154 వద్ద కూడా రెండు దారులు ఉన్న అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలన్నారు. అలానే పెద్ద పావని రోడ్డు లెవల్ క్రాసింగ్ 158 వద్ద బ్రిడ్జి కింద నుంచి వెళ్లేలా అండర్ బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు.

## అడిషనల్ ఎస్పీగా అప్పారావు బాధ్యతలు



నెల్లూరు (సింధూరదర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా; నెల్లూరు జిల్లా పోలీసు శాఖలో అడిషనల్ ఎస్పీగా నియమితులైన పి.వి.అప్పారావు శుక్రవారం జిల్లాపోలీసు కార్యాల యంలో రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా అడిషనల్ ఎస్పీ సి.హెచ్. సౌజన్య ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పి.వి. అప్పారావు గతంలో ఆక్టోపస్ విభాగంలో మరియు విజయనగరం జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.



# ఒత్తిడిని జయించే దివ్య ఔషధం యోగా

## ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగ ఉత్తమ మార్గం

## ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల – ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో థీమాటిక్ సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన



నెల్లూరు (సింధూర దర్శిని )12 జూన్ నెల్లూరు జిల్లా; నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను అధిగమించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా అత్యుత్తమ సాధనమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. మన జీవనశైలిని ఆరోగ్యవంతంగా, సమతుల్యంగా తీర్చిదిద్దే గొప్ప జీవన విధానం యోగ అని ఆయన అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర–2026 కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన థీమాటిక్ సామూహిక యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, నగర మేయర్ సుజాతతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం యోగా గురువు సలీనా పర్యవేక్షణలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మేయర్, వివిధ శాఖల అధికారులు, యోగా సాధకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని సామూహికంగా యోగాసనాలు ఆచరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమన్వయాన్ని పెంపొందించే సమగ్ర ఆరోగ్య సాధనమని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న డయాబెటిస్, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని చెప్పారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు యోగాను అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని సొంతం చేసుకోవచ్చని సూచించారు. యోగాను ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర–2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ల సహకారంతో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.కె. హజర్ అలీ, డీఎస్డీఓ జనీమ్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, యోగా సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు

## ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్, పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి




గూడూరు (సింధూరదర్శిని) 12 జూన్ నెల్లూరు జిల్లా ; ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ మరియు గూడూరు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరిగ మురళీధర్ మరియు సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసనర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్న ముఖ్య నాయకులు సభ్యులు కొడవలూరు భక్తవత్సల రెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేవూరు విజయ మోహన్‌రెడ్డి. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలు చెప్పి గద్దెనెక్కి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది ,ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదు ఎన్నికకు ముందు ప్రజలకు ఇచ్చిన బాండ్లు కేవలం చలి కాచుకోవడానికి తప్ప దేనికీ పనికిరావు కూటమి ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అర్థమైంది సాధారణంగా చంద్రబాబు ప్రభుత్వం పై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, నిరసన ఉందో చెప్పడానికి మహిళలు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చి చంద్రబాబు పాలనపై తమ అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైంది కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు,శ్రీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని చెప్పిన చంద్రబాబు ఈరోజు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్న రాష్ట్రంగా మార్చారు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలలో ఆంధ్ర రాష్ట్రం భారతదేశంలోనే మొదట స్థానం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్క హామీని కూడా అమలు చేయని పక్షంలో ప్రజలే వీటన్నిటికీ సాక్ష్యంగా వహించి ఆ ప్రభుత్వాన్ని మరల ఎన్నుకోవడం జరగదని చెప్పేసి ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నాను. ఆడబిడ్డ ఆడబిడ్డ నీది నిరుద్యోగ భృతి 50 ఏళ్ల పైబడిన బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలకు పెన్షన్ అన్నదాత సుఖీభవ ఉచిత గ్యాస్ సిలిండర్ జాబ్ క్యాలెండర్ వంటి కీలక హామీలు ఇప్పటికీ చేయలేని సూపర్ సెక్స్ పథకాలను సూపర్ ఫ్లాప్ చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని చంద్ర బాబు ప్రభుత్వం చేసిన మోసాలు ప్రజల్లోకి తీసుకెళ్లి నందుకు రాష్ట్రవ్యాప్తంగా జనపరుబాట కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో ద్వారా తెలియజేశారు. డీఎస్సీ అనేది లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశ పరీక్ష రాసిన తర్వాత పిలిచి మరి సర్టిఫికెట్లు వెరిఫై చేసి వారికి ఉద్యోగాలు ఇవ్వలేదు 1:1 అంటే కూడా అర్థం కాని పరిస్థితిలో ఉంది ఈ కూటమి ప్రభుత్వం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లు విజయ్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి యామిని, బొమ్మిడి శ్రీనివాసులు, మీరా రెడ్డి, మండల అధ్యక్షులు మండల నాయకులు అనుబంధ విభాగాల అధ్యక్షులు కార్యకర్తలు నాయకులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గృహ స్థలాల కేటాయింపుకు కమిటీ సభ్యులు అధికారులతో సమీక్ష

### జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి ( సింధూర దర్శిని) 12 జూన్ తిరుపతి జిల్లా ; తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ఉద్యోగులకు గృహ స్థలాల కేటాయింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై టీటీడీ వారు పనబాక లక్ష్మి, బోర్డు సభ్యులు మరియు జ్యోతుల నెహ్రూ, జగ్గంపేట ఎమ్మెల్యే వారిని టీటీడీ వారు కమిటీ గా నియమించారు, సదరు కమిటీ సభ్యులు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి వారితో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వడమాలపేట మండలం పాదిరేడు అరణ్య ప్రాంతం మరియు ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో టీటీడీ ఉద్యోగులకు గృహ స్థలాల కేటాయింపుకు సంబంధించి తలెత్తిన సమస్యలు, పెండింగ్ అంశాలు, భూసంబంధిత పరిపాలనా అంశాలపై రెవెన్యూ శాఖ అధికారులు, టీటీడీ అధికారులు, టీటీడీ బోర్డు సభ్యులతో కలిసి సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగుల ప్రతినిధులు తమ సమస్యలను, గృహ స్థలాల కేటాయింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగులు వ్యక్తం చేసిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి, చట్టబద్ధమైన పరిధిలో వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. గృహస్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెండింగ్ అంశాల పరిష్కారానికి సమన్వయం తో పనిచేసి, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# కాణిపాకంలో యోగాంధ్ర ఉత్సవాలు



కాణిపాకం (సింధూరదర్శిని)12 జూన్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం ప్రధాన దేవాలయం ఆలయ మాడా వీధుల నందు శుక్రవారం యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు జిల్లా టూరిజంశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం మరియు సిబ్బంది, ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ , దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, చైర్మన్ మణి నాయుడు, డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఆలయ ఏఈఓ, సూపర్డెంట్లు, కాణిపాకం ఎస్.ఐ దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కాణిపాకం (సింధూర దర్శిని) 12 జూన్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి ని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బివి నాగరత్న, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు శేషవస్త్రం జ్ఞాపికను అందజేసిన చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణాసారిక , దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపర్డెంట్ వాసు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# గణపయ్యను దర్శించుకున్న మంత్రి : ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం( సింధూరదర్శిని) 12 జూన్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చంనాయుడు, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం స్వామివారి జ్ఞాపికను అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , మరియు ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, కాణిపాకం ఎస్ఐ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# బాపట్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల, మెరుగైన వసతులకు మాజీ సైనికుల వినతి



బాపట్ల, సింధూరదర్శిని:
బాపట్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు జీటీ, జనశతాబ్ది, వందే భారత్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను బాపట్లలో నిలిపివేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాధుర్‌కు వినతిపత్రం అందజేశారు. బాపట్ల రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు నేతృత్వంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధి, ప్రజల సౌకర్యాల కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు ఏకతాటిపైకి వచ్చి రైల్వే శాఖకు వినతులు అందించడం అభినందనీయమని అన్నారు. బాపట్ల ప్రస్తుతం జిల్లా కేంద్రంగా, సూర్యలంక బీచ్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్, పలు విద్యాసంస్థలతో ప్రాధాన్యత సంతరించుకున్న నేపథ్యంలో రైల్వే శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజల చిరకాల కోరికలను పరిగణనలోకి తీసుకుని స్టేషన్‌లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు బాపట్లలో నిలుపుదల కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉపాధ్యక్షుడు చలికొండ వెంకట కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ పీటా సారథి, మాజీ సైనికులు కె.ఆంజనేయులు, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలో పలు వార్డుల్లో పారిశుధ్య పనులు పురోగతిని పరిశీలించిన కమిషనర్



బాపట్ల సింధూరదర్శిని:
బాపట్ల మునిసిపల్ కమిషనర్ హాసిని ఈరోజు పట్టణంలోని పలు వార్డులు మరియు GBC రోడ్డు నందు పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణకి కమిషనర్ పలు సూచనలు జారీ చేస్తూ, పట్టణంలో ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం 23వ వార్డు వివేకానంద కాలనీ మునిసిపల్ పార్కును పరిశీలించారు. పార్కు నందు పరిశుభ్రత, మొక్కల సంరక్షణ, సందర్శకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను కమిషనర్ పరిశీలించి, పార్కును మరింత అందంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి సూచించారు. పారిశుధ్యం ప్రజారోగ్యానికి ఎంతో ముఖ్యమని, పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలని కమిషనర్ హాసిని పేర్కొన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కొనసాగుతున్న మంచినీటి లీకేజీ



బాపట్ల, సింధూరదర్శిని:
పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఎదురుగా ఉన్న మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా పెద్దఎత్తున తాగునీరు వృథాగా పోతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే పలుమార్లు గుంతలు తవ్వి మరమ్మతులు చేపట్టినప్పటికీ లీకేజీ మాత్రం యథావిధిగా కొనసాగుతోందని వారు చెబుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై పలుచోట్ల మంచినీటి పైప్‌లైన్లు లీకవుతున్నాయని, వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన పురపాలక సంఘ అధికారులు ఈ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం అధికారులు సంచరించే ప్రధాన రోడ్లపైనే లీకేజీలు కనిపిస్తున్నప్పటికీ వాటి నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, పురపాలక సంఘ ప్రత్యేక అధికారి మరియు మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఏల్చూరులో ఓరుగంటి లక్ష్మీ నరసమ్మకు ప్రముఖుల నివాళి



సంతమాగులూరు, జూన్ 12, సింధూరదర్శిని:
సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన ఏల్చూరు-2 ఎంపీటీసీ సభ్యులు ఓరుగంటి కోటిరెడ్డి గారి మాతృమూర్తి ఓరుగంటి లక్ష్మీ నరసమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె భౌతికకాయానికి ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గారితో కలిసి అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులు అర్పించిన వారిలో ఏల్చూరు మాజీ సర్పంచ్ దేవరపల్లి లక్ష్మారెడ్డి, దివికోలు సుబ్బారావు, కేసరి చెన్నారెడ్డి, గడ్డం నర్సిరెడ్డి, బండి కోటిరెడ్డి, ఎస్. సురేంద్ర, అద్దంకి ఆంజనేయులు, గుర్రం ఏడుకొండలు తదితర స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## సంతమాగులూరులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

సంతమాగులూరు, జూన్ 12,సింధూరదర్శిని:
ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా సంతమాగులూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి ఓటరు ధృవీకరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల విధులు, ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల గుర్తింపు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న బూత్ స్థాయి అధికారులు శిక్షణలో పాల్గొని ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తెలుసుకున్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాబోయే ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితాల ప్రామాణికత కీలకమైన నేపథ్యంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించి నిర్దేశిత గడువులోగా నివేదికలు సమర్పించాలని సూచించారు. శిక్షణ అనంతరం అధికారులు తమకు కేటాయించిన కిట్లను స్వీకరించి ఇంటింటి ధృవీకరణ కార్యక్రమానికి సిద్ధమయ్యారు.

## దోమల నివారణకు హాస్టల్లో ఏసీఎం ఆల్ఫా సైపర్ మెత్రిన్ పిచికారి




బద్వేల్ జూన్ 12సింధూరదర్శిని:
బద్వేలు పట్టణంలోని కోటవీధి పరిధిలో గర్ల్స్ హాస్టల్ ఒకటి, రెండు , ఎస్సీ బాలర హాస్టల్, బీసీ హాస్టల్, కాలేజీ గర్ల్స్ హాస్టల్ ,కాలేజీ బాయ్స్ హాస్టల్ ,నందు దోమల నివారణకై ఎన్ వి బి డి సి పి మలేరియా సబ్ యూనిట్ అధికారి బ్రహ్మాజీ హాస్టల్లో పిచికారి చేయించడం జరిగింది. అనంతరం కోటవీధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది దోమల కొట్టకుండా దోమల పుట్టకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రతను శుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిల్వ ఉన్న డ్రమ్ములు, తొట్లు వారానికి ఒక గంట సేపు ఆరబెట్ట కోవడం వల్ల లార్వా ఉత్పత్తి కాకుండా నిరోధించవచ్చని, అలాగే దోమల కొట్టకుండా మనం పాటించవలసిన జాగ్రత్తలు దోమతెరల్లో నిద్రించడం వేపాకు పొగ వేసుకోవడం వల్ల దోమల కొట్టకుండా కాపాడుకోవచ్చు అలాగే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందువలన బయట పొలంలో పనులు చేసే రైతులు గాని వడదెబ్బ గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని ఉదయం పది గంటల లోపల సాయంత్రం ఐదు గంటల తర్వాతనే బయట పనులు చేసుకోవాలని వడదెబ్బ తగిలిన తర్వాత ప్రాథమికంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఖఅఎ, ం ఆశా దగ్గర ఉన్నాయని తెలియజేయడమైనది. హెల్త్ అసిస్టెంట్ శ్రీ రామయ్య మాట్లాడుతూ ప్రతి సోమవారం వెక్టార్ కంట్రోల్ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే యాప్ లను ఏఎన్ఎమ్స్ అప్లోడ్ చేయాలని తెలియజేయడమైనది. హెల్త్ అసిస్టెంట్ జనార్ధన రావు మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటింటా లార్వా సర్వేలు ఫీవర్ సర్వేలు చేపడుతున్నామని ఎక్కడ కూడా డెంగు మలేరియా చికెన్ గునియా బోధకాలు మెదడువాపు వ్యాధులకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కావడం లేదని తెలియజేయడం జరిగింది.. హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జూన్ నెల ఒకటి నుండి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు జరుగుతున్నందున పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఎవరికైనా జ్వరాలు వస్తే ప్రభుత్వ ఆస్పత్రికి పోయి రక్త పరీక్షలు వైద్యం చేయించుకోవాలని అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోటవీధి గర్ల్స్ హాస్టల్ వార్డెన్స్ లక్ష్మీదేవి, సంపూర్ణమ్మ, ఏఎన్ఎంస్ స్వాతి, ఆశ అనిత,హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాంధ్రలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలి





సంతమాగులూరు, జూన్ 12, సింధూరదర్శిని:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని మండలంలో విజయ వంతం చేయడంతో పాటు 18 సంవత్సరాల లోపు ప్రతి విద్యార్థిని నమోదు చేసి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఎంపీడీఓ జ్యోతిర్మయ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలకు యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాది అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యోగాంధ్రలో నమోదు అయిన ప్రతి విద్యార్థికి యోగాసనాలపై ప్రత్యేక శిక్షణ అందించి, పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సమన్వయంతో పనిచేసి యోగాంధ్రను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. శిక్షణ కార్యక్రమంలో పీఈటీలు డాక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఎన్. వీరేంద్ర యోగాసనాల ప్రాధాన్యత, సరైన పద్ధతులు, పోటీల నిర్వహణ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 వి. కోటేశ్వరరావు, ఎంఈఓ-2 దినేష్ కుమార్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బాలయ్య, కాశీ విశ్వనాథ్, హరినారాయణ కృష్ణతో పాటు మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. యోగాంధ్ర ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంపొందించి, యోగా సంస్కృతిని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

## కడప జిల్లా.. పోరుమామిళ్లలో భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



బద్వేల్.(కడప ప్రతినిధి) జూన్ 12 సింధూరదర్శిని:
కడప జిల్లా పోరుమామిళ్లలోని పద్మావతి కళ్యాణ మండపంలో ఈరోజు భూ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ఉన్న పోరుమామిళ్ల. కలసపాడు కాశినాయన. బికోడూరు. మండలాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు సమర్పించారు. భూ హక్కులు, సరిహద్దు వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, భూ రికార్డుల సవరణలు తదితర సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని బాధితులు కోరారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులుహామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.



## చంద్రబాబు హామీల వైఫల్యంపై ఇంకొల్లులో ర్యాలీ నిరసన

ఇంకొల్లు జూన్ 12 సింధూరదర్శిని: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారని ఆ హామీలు అమలుపరచడంలో విఫలమయ్యారని పర్చూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి గాదే మధుసూధన రెడ్డి అన్నారు చంద్రబాబు వెన్నుపోటు రెండేళ్లు నినాదంతో నిరసన నిర్వహించారు సినిమా హాల్ సెంటర్లోని అంబేద్కర్ బాబు జగజ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరము ఆయన ప్రసంగించారు అక్కడనుండి స్తూపం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది ఈ కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు ఇంకొల్లు మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు మరియు కార్యకర్తలు అభిమానులు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## నేడు ఇంకొల్లు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇంకొల్లు జూన్ 12 సింధూరదర్శిని: ఇంకొల్లు మండల పరిధిలో వంకాయలపాడు ఇంకొల్లు సబ్ స్టేషన్ పరిధిలో ఉదయము నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలియజేశారు సబ్ స్టేషన్ లో పరిధిలో మరమ్మత్తులు పనులు చేయడంతో పాటు ఇంకొల్లులో ప్రధానంగా లావణ్య కాంప్లెక్స్ సమీపంలో ఒకటి విష్ణాలయం సమీపంలో ఒకటి ఫౌండ్రి ల సమీపంలో మరొకటి మొత్తము నాలుగు హండ్రెడ్ కి వి ట్రాన్స్ఫారాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలియజేశారు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు కొనికి రోడ్డులో పాండా షోరూమ్ సమీపంలో గత నాలుగు రోజులుగా ట్రాన్స్ఫారం మొరాయించడంతో ట్రాన్స్ఫారంకు మరమ్మత్తు పనులు ప్రారంభించారు.


## అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ నాగరాణి

భీమవరం సింధూరదర్శిని: ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 112 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ద్వారా ఇప్పటివరకు 7,669 దరఖాస్తులు స్వీకరించగా, 6,678 పరిష్కరించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలపై అధికంగా అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పురుషులకు కూడా రొమ్ము క్యాన్సర్ వస్తుందా?

-ప్రముఖ నటుడి ప్రకటనతో మరోసారి చర్చలోకి..!
-ప్రముఖ నటుడు టైలర్ మేన్‌కు రొమ్ము క్యాన్సర్
-పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని అవగాహన
-రొమ్ములో గడ్డ, చనుమొనలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు
-వ్యాయామం, రెగ్యులర్ హెల్త్ చెకప్‌లతో ఈ క్యాన్సర్‌కు చెక్



హాలీవుడ్ నటుడు, మాజీ ప్రొఫెషనల్ రెజ్లర్ టైలర్ మేన్ తనకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కీమోథెరపీ చికిత్స తీసుకుంటున్న ఆయన పురుషుల్లో కూడా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని అవగాహన కల్పించేందుకు ఈ విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులో "రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు తెలిసినప్పుడు మొదట దానిని రహస్యంగా ఉంచాలనిపించింది. కానీ పురుషుల్లో ఈ వ్యాధి గురించి అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ఆలస్యంగా గుర్తిస్తున్నారని తెలుసుకున్నాను" అని పేర్కొన్నారు. తనకు వచ్చిన గడ్డను తొలగించాలని భార్య ఒత్తిడి చేయకపోతే వ్యాధి మరింత ఆలస్యంగా బయటపడేదని ఆయన తెలిపారు.

సాధారణంగా రొమ్ము క్యాన్సర్ అంటే మహిళలకే వస్తుందనే భావన ఉంటుంది. అయితే పురుషుల్లో కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. యూకేకు చెందిన క్యాన్సర్ రీసెర్చ్ సంస్థ ప్రకారం ఈ క్యాన్సర్ కేసుల్లో 1 శాతం కంటే తక్కువ మాత్రమే పురుషుల్లో నమోదవుతాయి. అయినప్పటికీ ముందుగానే గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

గమనించాల్సిన లక్షణాలు
రొమ్ము భాగంలో గడ్డ లేదా వాపు
రొమ్ము కణజాలం మందంగా మారడం
చర్మం ఎర్రబడటం లేదా గుంటలు పడినట్లు కనిపించడం
చనుమొన నొప్పి లేదా సున్నితత్వం
చనుమొన లోపలికి ముడుచుకుపోవడం
చనుమొన నుంచి రక్తం లేదా ద్రవం కారడం
చంక కింద లింఫ్ నోడ్స్ వాపు

ఎవరికి ఎక్కువ ప్రమాదం?
వయసు పెరగడం, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉండటం, జన్యు మార్పులు, హార్మోన్ల అసమతుల్యత, ఊబకాయం, కాలేయ వ్యాధులు, ఛాతీ భాగానికి గతంలో రేడియేషన్ చికిత్స తీసుకోవడం వంటి అంశాలు ప్రమాదాన్ని పెంచుతాయి.

నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు
బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. మద్యం తాగొద్దు. కుటుంబంలో ఆరోగ్య సమస్యల గురించి అవగాహన ఉండాలి. రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలి. ఛాతీ భాగంలో ఏదైనా అసాధారణ మార్పు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.



# రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. టికెట్ బుకింగ్ ఇక చాలా ఈజీ!

-జులై 15 నాటికి సరికొత్త ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ప్రారంభం
-నిమిషానికి లక్షన్నర టికెట్ల బుకింగ్‌కు పెరగనున్న సామర్థ్యం
-ఇష్టమైన సీటును ఎంచుకునేందుకు ప్రయాణికులకు కొత్త అవకాశం
-విద్యార్థుల ఫిర్యాదులతో వెంటనే స్పందించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
-తత్కాల్ బుకింగ్ సమయంలోనూ సర్వర్ సమస్యలకు చెక్

రైలు టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌లో ప్రయాణికులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే తెరపడనుంది. వెబ్‌సైట్ స్లోగా లోడ్ అవ్వడం, తత్కాల్ సమయంలో సర్వర్లు మొరాయించడం, పేమెంట్ ఫెయిల్యూర్స్ వంటి ఇబ్బందులను అధిగమించేందుకు భారతీయ రైల్వే సిద్ధమైంది. జులై 15 నాటికి భారీ మార్పులతో, అత్యంత వేగవంతమైన ఐఆర్‌సీటీసీ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త ప్లాట్‌ఫామ్ కోట్లాది మంది ప్రయాణికులకు సులభమైన, వేగవంతమైన టికెట్ బుకింగ్ అనుభవాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**విద్యార్థుల ఫిర్యాదుతో తక్షణ స్పందన**

జూన్ 11న జైపూర్‌లోని మాలవీయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్‌ఐటీ)లో విద్యార్థులతో జరిగిన ఒక సమావేశంలో మంత్రి ఈ ప్రకటన చేశారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకునేటప్పుడు ఎదురవుతున్న ఇబ్బందులను, ముఖ్యంగా తత్కాల్ సమయంలో వెబ్‌సైట్ క్రాష్ అవ్వడం, క్యాప్చా (CAPTCHA) సమస్యలు, డబ్బులు కట్ అయినా టికెట్ కన్ఫర్మ్ కాకపోవడం వంటి అంశాలను విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన అశ్విని వైష్ణవ్, అక్కడికక్కడే రైల్వే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కేవలం 30 రోజుల్లో కొత్త వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసే అవకాశంపై చర్చించారు. అనంతరం, జులై 15 కల్లా కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

**భారీగా పెరగనున్న సామర్థ్యం, కొత్త ఫీచర్లు**

ప్రస్తుతం భారతదేశంలో రైలు టికెట్లలో దాదాపు 88 శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (ౡ=ా) ను భారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీనివల్ల కీలకమైన మార్పులు చోటుచేసుకోనున్నాయి.

బుకింగ్ సామర్థ్యం: ప్రస్తుతం నిమిషానికి సుమారు 32,000 టికెట్లు బుక్ చేసుకునే సామర్థ్యం ఉండగా, కొత్త వెబ్‌సైట్‌లో ఇది దాదాపు ఐదు రెట్లు పెరిగి నిమిషానికి 1.5 లక్షలకు పైగా చేరుకోనుంది.

విచారణ వేగం: రైళ్ల లభ్యత, వెయిటింగ్ లిస్ట్ వంటి వివరాల కోసం ప్రస్తుతం నిమిషానికి 4 లక్షల విచారణలు (వఅనబఀఅతీఅవం) సాధ్యం కాగా, ఇకపై ఇది పది రెట్లు పెరిగి 40 లక్షలకు పైగా చేరనుంది.

ఈ సాంకేతిక మార్పుల వల్ల పండుగలు, వేసవి సెలవులు, తత్కాల్ బుకింగ్ వంటి అత్యంత రద్దీ సమయాల్లోనూ సర్వర్లు మొరాయించడం, సీట్లు మాయమవడం వంటి సమస్యలు భారీగా తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

వీటితో పాటు ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇకపై టికెట్ బుక్ చేసుకునేటప్పుడే తమకు ఇష్టమైన సీటు లేదా బెర్త్‌ను ఎంచుకునే వెసులుబాటు (సీట్ ఛాయిస్ ఆప్షన్) కల్పించనున్నారు. ఇది కుటుంబాలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది.

అలాగే, వివిధ తేదీల్లో ధరలను పోల్చుకునేందుకు 'ఫేర్ క్యాలెండర్', బహుళ ప్రాంతీయ భాషల్లో వెబ్‌సైట్‌ను ఉపయోగించుకునే సౌకర్యం, దివ్యాంగులు, విద్యార్థులు, రోగుల కోసం బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసే సదుపాయాలను కూడా తీసుకురానున్నారు. ఈ మార్పులు కోట్లాది మంది రైలు ప్రయాణికులకు టికెట్ బుకింగ్ సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించి, ప్రయాణాన్ని మరింత సాఫీగా మారుస్తాయని ఆశిస్తున్నారు.

# బెంగాల్‌కు టాటాను తిరిగి తీసుకొస్తాం

సీఎం సువేందు అధికారి ప్రకటన
టాటా గ్రూప్‌ను తిరిగి పశ్చిమ బెంగాల్‌కు తీసుకొస్తామని సీఎం ప్రకటన
2008లో సింగూర్ నుంచి వెళ్లిపోయిన టాటా నానో ప్రాజెక్టు
భూసేకరణలో పాత తప్పులు పునరావృతం కావని ప్రభుత్వం హామీ
గత వామపక్ష, తృణమూల్ ప్రభుత్వాల విధానాలను విమర్శించిన సువేందు



పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక పెట్టుబడులను తిరిగి పట్టాలెక్కించే పెట్టే దిశగా నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక ప్రకటన చేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రం నుంచి తరలివెళ్లిన టాటా గ్రూప్‌ను మళ్లీ వెనక్కి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కోల్‌కత్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "టాటాలను మేము తిరిగి బెంగాల్‌కు తీసుకువస్తాం" అని ప్రకటించారు. సుమారు 18 ఏళ్ల క్రితం సింగూర్‌లో టాటా నానో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. నాటి వామపక్ష ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ అప్పటి ప్రతిపక్ష నేత మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఎత్తున ఉద్యమం జరిగింది. ఈ ఆందోళనల కారణంగా టాటా మోటార్స్ తన ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించగా, ఈ పరిణామం బెంగాల్ పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బలవంతపు భూసేకరణతో వామపక్ష ప్రభుత్వం, కేవలం ప్రచారానికే పరిమితమైన పరిశ్రమలతో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. తమ బీజేపీ ప్రభుత్వం అవినీతికి, మధ్యవర్తులకు తావులేకుండా పారదర్శక విధానాలతో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన బీజేపీ, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించిన విషయం విదితమే. గడిచిన మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి, రాష్ట్ర పారిశ్రామిక పునరుజ్జీవనాన్ని ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా ప్రకటించారు.

# చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలి

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ
వయసు పెరిగినా చంద్రబాబు రాష్ట్రం కోసం శ్రమిస్తున్నారని కితాబు
టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న



అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించగా... పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించి రాష్ట్రం శాంతి, సుభిక్షాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బుద్దా వెంకన్న... ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి మరింత పురోగతి అందించేలా చంద్రబాబుకి ఆరోగ్యం, శక్తి కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే గత ప్రభుత్వ పాలనలో చోటు చేసుకున్న అవకతవకలను ప్రజలు గమనించారని, అందుకే ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు కూటమికి బలమైన మద్దతు అందించారని గుర్తుచేశారు. వరదలు వంటి ప్రకృతి విపత్తులను రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. వయసు పెరిగినా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు.

## ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ

సంతమాగులూరు సింధూరదర్శిని: రానున్న ఎన్నికలు సమర్థవంతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు త్వరలో జరగనున్న ఓటర్ల జాబితా సవరణపై బూతు లెవల్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసేందుకు అధికారులు సమావేశం అవ్వాలని తాసిల్దార్ కే రవిబాబు సూచించారు త్వరలో గ్రామాలలో ఇంటింటికి ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు బూతులు ఎవరు అధికారులు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని ఓటర్లలో మార్పులు చేర్పులు చేపట్టాలని నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని రానున్న ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు.



## టాటా కార్లు కొనాలనుకునేవారికి షాక్..

అన్ని మోడళ్లకు వర్తింపు
ముడి పదార్థాల వ్యయం, ద్రవ్యోల్బణమే కారణం
ఇటీవల ఇతర కంపెనీలూ పెంచిన వైనం

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. గరిష్ఠంగా 1.5 శాతం వరకు ధరల్ని పెంచుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ పెంపు ఐసీఈ మోడళ్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలకూ వర్తించనుంది. పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ వాటిలో పెద్ద భాగాన్ని తామే భరిస్తున్నామని, అయితే కొంత భారాన్ని వినియోగదారులపై మోపక తప్పడం లేదని కంపెనీ పేర్కొంది. ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని తెలిపింది. వాహనం, వేరియంట్‌ను బట్టి మారుతుందని స్పష్టం చేసింది. ఇటీవల ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపులు సాధారణంగా మారాయి. గత నెలలో హ్యుందాయ్ కూడా తన వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచింది. ముడి పదార్థాల ధరలు, కమొడిటీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడమే కారణమని తెలిపింది. అలాగే మారుతి సుజుకి జూన్ నుంచి వివిధ మోడళ్లపై రూ.30,000 వరకు ధరలు పెంచగా మహీంద్రా కూడా ఈ ఏడాది ప్రారంభంలోనే తన ఎస్‌యూవీలు, కమర్షియల్ వాహనాల ధరలను సవరించింది. టాటా మోటార్స్ ధరల పెంపు ప్రకటన అనంతరం కంపెనీ షేర్లు కూడా మార్కెట్లో స్వల్ప లాభాలతో ట్రేడ్ అయ్యాయి. వాహన తయారీ సంస్థలు ఒకవైపు లాభదాయకతను కాపాడుకుంటూనే మరోవైపు కొత్త ఉత్పత్తులు, సాంకేతికతలపై పెట్టుబడులు కొనసాగించేందుకు ధరల సవరణల మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# బంగ్లాలో రాముడి భారీ విగ్రహ నిర్మాణానికి బ్రేక్..

-ఇస్లామిక్ అతివాదుల ఒత్తిడే కారణమా?
-ప్రపంచంలోనే అతిపెద్ద రాముడి విగ్రహ నిర్మాణం నిలిపివేత
-ఇస్లామిక్ సంస్థల ఒత్తిడి కారణమని ఆరోపణలు
-ఆందోళన వ్యక్తం చేసిన తస్లీమా నస్రీన్
-బంగ్లాలో హిందూ మైనారిటీల భద్రతపై చర్చ
-మత స్వేచ్ఛపై ప్రశ్నలు



బంగ్లాదేశ్‌లో నిర్మాణంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద శ్రీరాముడి విగ్రహ పనులను అక్కడి అధికారులు నిలిపివేశారు. గైబాంధా జిల్లాలోని పలాష్‌బారి ప్రాంతంలోని శ్రీశ్రీ రాధా గోవింద, కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. అయితే స్థానిక ఇస్లామిక్ సంస్థలు, మత ఛాందసవాద గ్రూపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నిర్ణయం బంగ్లాదేశ్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా అక్కడి హిందూ మైనారిటీల హక్కులపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విగ్రహ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని మతపరమైన సంస్థలు నిరసనలు చేపట్టడం, కఠిన వ్యాఖ్యలు చేయడం వల్ల పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ప్రవాస బంగ్లాదేశ్ రచయిత్రి, మానవ హక్కుల కార్యకర్త తస్లీమా నస్రీన్ ఈ పరిణామాన్ని తీవ్రంగా ఖండించారు. "బంగ్లాదేశ్‌లో లక్షలాది మసీదులు ఉన్నాయి. కొత్త వాటి నిర్మాణం కూడా కొనసాగుతోంది. అలాంటప్పుడు ఒకే ఒక్క రామాలయం లేదా రాముడి విగ్రహ నిర్మాణంపై ఎందుకు ఇంత వ్యతిరేకత?" అని ప్రశ్నించారు. మత స్వేచ్ఛ అందరికీ సమానంగా వర్తించాలని, అది కేవలం మెజారిటీ వర్గానికే పరిమితం కాకూడదని ఆమె పేర్కొన్నారు. పలాష్‌బారి ప్రాంతంలో గతంలో హిందూ దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం జరిగిన ఘటనలను గుర్తు చేసిన తస్లీమా నస్రీన్ తాజా పరిణామం హిందూ మైనారిటీల భద్రతపై మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇండోనేషియా, యూఏఈ, మలేషియా, ఒమన్ వంటి ముస్లిం మెజారిటీ దేశాల్లో కూడా భారీ హిందూ దేవాలయాలు ఉన్నాయని, అక్కడ వాటిని ఎవరూ దేశానికి ముప్పుగా చూడరని ఆమె వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో బంగ్లాదేశ్ పత్రిక 'బ్లిట్జ్' సంపాదకుడు సలాహుద్దీన్ షోయబ్ చౌధురి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక జిహాదీ, ఇస్లామిక్ అతివాద గ్రూపుల నిరసనల కారణంగానే రాముడి విగ్రహ నిర్మాణాన్ని నిలిపివేసినట్లు ఆయన ఆరోపించారు.

# టీవీ, రేడియో ప్రసారాలకు కొత్త రూల్స్.. ఏకీకృత విధానం దిశగా కేంద్రం

**టీవీ, రేడియో ప్రసారాలకు కొత్త ముసాయిదా నియమాలు విడుదల - పాత మార్గదర్శకాలన్నీ రద్దు చేసి ఒకే గొడుగు కిందకి**

**వ్యాపార సరళీకరణ, డిజిటల్ విధానాలే ప్రధాన లక్ష్యం - టెలికమ్యూనికేషన్స్ చట్టం 2023 కింద నూతన వ్యవస్థ**

**ప్రజాభిప్రాయ సేకరణకు జులై 27 వరకు గడువు**

దేశంలోని టెలివిజన్, రేడియో ప్రసార రంగంలో భారీ సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న అనేక మార్గదర్శకాలను ఒకే గొడుగు కిందకి తీసుకొస్తూ 'టెలికమ్యూనికేషన్స్ (టెలివిజన్, రేడియో, అనుబంధ సేవలు) రూల్స్, 2026' పేరుతో ముసాయిదా నియమావళిని విడుదల చేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. కొత్త టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023కు అనుగుణంగా ఈ మార్పులు చేపట్టినట్టు తెలిపింది. ఈ కొత్త ముసాయిదా నిబంధనలతో ప్రసార పరిశ్రమకు ఏకీకృత, అత్యంత సరళీకృత నియమావళి అందుబాటులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. టీవీ, రేడియో ప్రసార రంగంలో వ్యాపార సరళీకరణను (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రోత్సహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ కొత్త నియమావళి అమల్లోకి వస్తే, ప్రస్తుతం ఉన్న అనేక పాత గైడ్‌లైన్స్ రద్దవుతాయి.

**ఒకే గొడుగు కిందకి రానున్న సేవలు**

ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న పలు విధానాలను ఈ కొత్త ముసాయిదాలో విలీనం చేశారు. వాటిలో ముఖ్యమైనవి:



శాటిలైట్ టెలివిజన్ ఛానళ్ల అప్ లింకింగ్, డౌన్ లింకింగ్ మార్గదర్శకాలు.
డైరెక్ట్-టు-హోమ్ (డీటీహెచ్) బ్రాడ్‌కాస్టింగ్ సేవల లైసెన్సింగ్ విధానాలు.
హెడ్‌ఎండ్-ఇన్-ది-స్కై (హెచ్‌ఐటీఎస్) ప్రసార సేవల మార్గదర్శకాలు.
ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఎఫ్‌ఎం రేడియో సేవల విస్తరణ (ఫేజ్-III) విధానాలు.
కమ్యూనిటీ రేడియో స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు.

కొత్త ముసాయిదాలోని కీలక అంశాలు

ఈ ముసాయిదాలో పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. అన్ని రకాల అనుమతుల ప్రక్రియను డిజిటల్ రూపంలోకి మార్చనున్నారు. అనుమతుల కోసం గతంలో తప్పనిసరిగా ఉన్న 'గ్రాంట్ ఆఫ్ పర్మిషన్ అగ్రిమెంట్' (జీఓపీఏ) పద్ధతిని తొలగించారు. దీనివల్ల విధానాలు మరింత సులభతరం కానున్నాయి. ఏదైనా వివాదాలు తలెత్తితే వాటి పరిష్కారం కోసం పారదర్శక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పులన్నీ ప్రసార రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని కేంద్రం విశ్వాసం వ్యక్తం చేసింది.

ఈ ముసాయిదా నియమావళిని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ప్రజలు, ఇతర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. దీనిపై సూచనలు, సలహాలు, లేదా అభిప్రాయాలను జులై 27వ తేదీలోగా మంత్రిత్వ శాఖలోని అండర్ సెక్రటరీ (బీపీడఎల్)కి పంపాలని కోరారు.

# అమిత్‌షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

**ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీతో రక్తహీనతను నివారించవచ్చన్న అమిత్ షా - 80 కోట్ల మందికి ఉచితంగా పోషకాలు నింపిన బియ్యం పంపిణీ**


**2028 డిసెంబర్ వరకు పథకాన్ని పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం - ఈ పథకం కోసం రూ. 17,082 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం**

**ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి పోషకాలతో ఈ బియ్యం తయారీ**

దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

**ఏమిటీ ఫోర్టిఫైడ్ బియ్యం?**

ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం



గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు.

**ఎందుకింత ప్రాధాన్యం?**

భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (NFHS-5) గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే, ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ?17,082 కోట్లు కేటాయించింది.

# 90 నిమిషాల ఆట.. వేల కోట్ల సంపాదన.. ఇది క్రిస్టియానో రొనాల్డో లెక్క!

**ఒక్క మ్యాచ్ ఆడితే రొనాల్డో సంపాదన సుమారు 30 కోట్లు - ఈ మొత్తం సంపాదించడానికి ఓ భారతీయ ఉద్యోగికి 2,500 ఏళ్లు**

**సౌదీ క్లబ్‌తో ఒప్పందం ద్వారా రొనాల్డో వార్షిక ఆదాయం 1,700 కోట్లకు పైమాటే**

**రొనాల్డో నికర ఆస్తి విలువ సుమారు 10,000 కోట్ల రూపాయలు**

**ఈ సంపదను అందుకోవాలంటే ఏడాదికి 12 లక్షల జీతంతో 83,000 ఏళ్లు పనిచేయాలి**

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు ఇక జీతం అనే మాట చిన్నదైపోయింది. అతను ఇప్పుడు సమయాన్ని శాసించే స్థాయిలో సంపాదిస్తున్నాడు. ఫుట్‌బాల్ మైదానంలో అడుగుపెట్టిన ప్రతిసారీ, కాలం అతని కోసం ప్రత్యేకంగా నడుస్తుంది. కేవలం 90 నిమిషాల ఆట అతనికి దాదాపు 30 కోట్ల రూపాయలు సంపాదించి పెడుతుంది. ఇదే మొత్తాన్ని ఏడాదికి 12 లక్షల రూపాయల జీతం తీసుకునే ఓ భారతీయ ఉద్యోగి సంపాదించాలంటే ఏకంగా 2,500 సంవత్సరాలు పడుతుంది. ఎన్డీటీవీలో వచ్చిన కథనం ప్రకారం.. ఈ లెక్కలు ఎలా సాధ్యమో వివరంగా చూద్దాం. ప్రస్తుతం 41 ఏళ్ల వయసులో ఉన్న రొనాల్డో, సౌదీ అరేబియా క్లబ్ అల్ నసర్ తో చేసుకున్న ఒప్పందం ద్వారా ఏడాదికి సుమారు 200 మిలియన్ డాలర్లు ఆర్జిస్తున్నాడు. భారత కరెన్సీలో ఇది సుమారు 1,700 కోట్ల రూపాయలతో సమానం. ఒక ఫుట్‌బాల్ సీజన్‌లో క్లబ్, జాతీయ జట్టు తరపున రొనాల్డో సగటున 55 మ్యాచ్‌లు ఆడతాడని అంచనా. ఈ లెక్కన అతని వార్షిక ఆదాయాన్ని మ్యాచ్‌ల సంఖ్యతో భాగిస్తే, ప్రతి మ్యాచ్‌కు అతని సంపాదన దాదాపు 30 కోట్ల రూపాయలని తేలుతుంది. అంటే.. 90 నిమిషాల ఆట, అదనపు సమయం కలిపి అతనికి వచ్చే ఆదాయం, మన



దేశంలోని ఎన్నో కంపెనీలు తమ ఉద్యోగులందరికీ ఏడాది జీతాల కోసం కేటాయించే బడ్జెట్‌తో సమానం. ఇది కేవలం అతని వార్షిక ఆదాయం మాత్రమే. ఇక అతని నికర ఆస్తి విలువ చూస్తే కళ్లు చెదరడం ఖాయం. ప్రస్తుతం రొనాల్డో ఆస్తి విలువ 1.2 బిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని అంచనా. మన కరెన్సీలో చెప్పాలంటే ఇది సుమారు 10,000 కోట్ల రూపాయలు. రెండు దశాబ్దాలకు పైగా అగ్రశ్రేణి ఫుట్‌బాల్ ఆడటం, ఛాంపియన్స్ లీగ్ బోనస్‌లు, స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఇమేజ్ రైట్స్, సొంత వ్యాపారాలు, ప్రపంచంలోని ఎన్నో దేశాల జనాభా కంటే ఎక్కువ ఉన్న సోషల్ మీడియా ఫాలోయింగ్‌ను ఆదాయంగా మార్చుకోవడం ద్వారా ఈ అపార సంపదను కూడబెట్టాడు. ఇప్పుడు ఈ 10,000 కోట్ల రూపాయల సంపదను, ఏడాదికి 12 లక్షలు సంపాదించే భారతీయ ఉద్యోగితో పోల్చి చూద్దాం. రొనాల్డో ఆస్తిని అందుకోవాలంటే.. ఆ ఉద్యోగికి దాదాపు 83,333 సంవత్సరాలు పడుతుంది. మరోలా చెప్పాలంటే.. ఒక వ్యక్తి తన 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎంత సంపాదించినా అది రొనాల్డో సంపద ముందు సముద్రంలో నీటిబొట్టు లాంటిదే. దాదాపు 2,000కు పైగా ఉద్యోగ జీవితాలను పక్కపక్కన పెడితే గానీ ఆ సంపదను అందుకోలేరు. ఫుట్‌బాల్, గ్లామర్, ట్రోఫీలు, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయింగ్‌ను పక్కనపెట్టి కేవలం అంకెలను చూస్తే, అసలు కథ బోధపడుతుంది. ఆధునిక ఫుట్‌బాల్ ప్రపంచంలో ఒక వ్యక్తి 90 నిమిషాల సమయం, వేలాది మంది సంవత్సరాల తరబడి చేసే ఉద్యోగానికి సమానంగా నిలుస్తోంది. ఇదే క్రిస్టియానో రొనాల్డో సృష్టించిన ఆర్థిక అద్భుతం.

## వదంతులకు చెక్.. ఆ విషయంలో క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్ దేవా కట్టా

**ఇతర సినిమాలకు పనిచేస్తున్నానన్న వదంతులను ఖండించిన దేవా కట్టా**

**క్లిక్స్ కోసం కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్య**

**ఇది తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ అని స్పష్టీకరణ**

**సరైన సమయంలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్న దర్శకుడు**



టాలీవుడ్ విలక్షణ దర్శకుడు దేవా కట్టా తన తదుపరి ప్రాజెక్టుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తాను ఏ ఇతర సినిమాకు పనిచేయడం లేదని, పూర్తిగా తన సొంత సినిమా పనుల్లోనే నిమగ్నమై ఉన్నానని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ఓ కీలక ప్రకటన చేశారు. "గత కొంతకాలంగా నా తదుపరి సినిమా రచన, అభివృద్ధి పనులతోనే ఎక్కువ సమయం గడుపుతున్నాను. నా రాబోయే ప్రయాణం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని దేవా కట్టా తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అదే సమయంలో తనపై వస్తున్న కొన్ని వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. "కొన్ని క్లిక్స్ కోసం దురుద్దేశంతో ప్రచారంలో ఉన్న పుకార్లకు స్పష్టత ఇస్తున్నాను. నేను ఏ ఇతర సినిమాకు ఒక్క షాట్ కూడా దర్శకత్వం వహించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. తన తదుపరి చిత్రాన్ని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా అభివర్ణించారు. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. 'ప్రస్థానం', 'రిపబ్లిక్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దేవా కట్టా ప్రకటనతో ఆయన తదుపరి సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# సినిమా న్యూస్



స్టైలిష్ సమ్మర్ ఫ్యాషన్ లుక్‌లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ప్రీతి పగడాల. 'మేఘున' అని కూడా పిలువబడే ప్రీతి పగడాల, అమెరికాకు చెందిన ఉత్సాహవంతురాలైన భారతీయ నటి, మోడల్ మరియు ప్రముఖ కంటెంట్ క్రియేటర్; ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో నివసిస్తున్నారు.

## అదేం పెద్ద విషయం కాదు... కల్కి డైరెక్టర్ క్లారిటీ

చేసింది మూడు సినిమాలే అయినప్పటికీ దర్శకుడిగా ఆకాశమే హద్దు అన్న రేంజ్‌లో క్రేజ్‌ను దక్కించుకున్న దర్శకుడు నాగ్ అశ్విన్. మొదటి సినిమా ఎవడే సుబ్రమణ్యం సినిమాతో తన మార్క్‌ను చూపించి, మహానటితో తెలుగు ప్రేక్షకులను మాత్రమే కాకుండా అన్ని భాషల ప్రేక్షకులను మెప్పించిన నాగ్ అశ్విన్, 'కల్కి' సినిమాతో ఏకంగా హాలీవుడ్ రేంజ్‌కు చేరిన విషయం తెల్సిందే. వరుస సినిమాలు చేయాలని కాకుండా, మంచి సినిమాలను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో నాగ్ అశ్విన్ సినిమాలు చేస్తూ వస్తున్నాడు. తాజాగా ఆయన తనకు ఇష్టమైన దర్శకుడు సింగీతం శ్రీనివాస్ దర్శకత్వంలో ఒక సినిమాను నిర్మించాడు. ఆయనతో సినిమా అంటే నిర్మాతలు ఇప్పుడు అంత రిస్క్ అవసరమా అనుకుంటారు. కానీ నాగ్ అశ్విన్ ఆయనపై ఉన్న అభిమానంతో ప్రయోగాత్మక సినిమాను నిర్మించి తన అభిమానంను చాటుకున్నాడు. సింగీతంపై ఉన్న అభిమానంను ఇలా చూపించుకున్నాను అంటూ పలు ఇంటర్వ్యూల్లో చెప్పుకొచ్చిన నాగ్ అశ్విన్ తాజాగా ఒక వీడియోతో వైరల్ అయిన విషయం తెల్సిందే. సింగీతం శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన 'సింగ్ గీతం' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగ్ అశ్విన్ కింద కూర్చున్న వీడియోలు అందరి దృష్టిని ఆకర్షించాయి. పైగా చెప్పులు విడిచి మరీ నాగ్ అశ్విన్ కింద కూర్చోవడంతో ఎంత గౌరవం అంటూ నాగ్ అశ్విన్ గురించి అంతా కూడా ప్రముఖంగా మాట్లాడుకోవడం మనం చూస్తున్నాం. సింగీతంతో పాటు, ఇతర గెస్ట్‌లు



మాట్లాడుతున్న సమయంలో చిన్నపిల్లాడి మాదిరిగా నాగ్ అశ్విన్ కింద కూర్చుని వారి మాటలు వినడం కనిపించింది. నాగ్ అశ్విన్ స్వామి భక్తి అంటూ కొందరు, ఆయనకు పెద్దలపై ఉన్న గౌరవం అంటూ పలువురు కామెంట్స్ చేశారు. ఆయన మామగారు అయిన ప్రముఖ అశ్వినీదత్ సైతం ఈ విషయం గురించి స్పందించారు.

నాగ్ అశ్విన్ వ్యాఖ్యలు... చెప్పులు విప్పి కూర్చున్న విషయం గురించి నాగ్ అశ్విన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించాడు. తనకు సింగీతం గారు అంటే అభిమానం, ఆయన మాట్లాడుతూ ఉంటే శ్రద్ధగా వినాలనే ఉద్దేశంతో కింద కూర్చున్నాను, కింద కూర్చున్న సమయంలో చెప్పులు ఉంటే కంఫర్ట్‌గా అనిపించదు. అందుకే ఆ సమయంలో చెప్పులు విప్పాను. అంతకు మించి ఏం లేదు. అదో పెద్ద విషయం అనుకోలేదు. దాన్ని గురించి ఇంత చర్చ అనవసరం అన్నట్లుగా నాగ్ అశ్విన్ చెప్పుకొచ్చాడు. సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఈ ప్రచారంకు సింపుల్ కామెంట్‌తో తేల్చి పారేశాడు. నాగ్ అశ్విన్ సింప్లిసిటీకి ఇది నిదర్శనం అంటూ ఆయన గురించి సోషల్ మీడియాలో మళ్లీ చర్చ మొదలైంది. ఇంత సింపుల్ జీవితాన్ని సాగించడం అంటే మామూలు విషయం కాదు, అది కేవలం నాగ్ అశ్విన్‌కే సాధ్యం అంటారు. కల్కి 2 సినిమా అప్‌డేట్.. వెయ్యి కోట్ల సినిమా తీసినా కూడా నాగ్ అశ్విన్ సింపుల్‌గానే ఉంటాడు. ఆయన ఒక చిన్న కారులోనే ప్రయాణించడం కూడా గతంలో వైరల్ అయ్యింది. ఇప్పుడు కొత్తగా కింద కూర్చోవడం కూడా వైరల్ అవుతోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియో కాకుండా గతంలోనూ ఆయన గురించి చాలా వీడియోలు, ఫోటోలు వైరల్ అయ్యాయి. సినిమాలతో పాటు, ఇలాంటి విషయాల కారణంగా నాగ్ అశ్విన్ వార్తల్లో నిలుస్తూ వస్తున్నాడు. ఇక నాగ్ అశ్విన్ నిర్మించిన సింగ్ గీతం సినిమాకు ప్రేక్షకుల్లో పాజిటివ్ బజ్ కనిపించింది. మరి నేడు విడుదలైన సినిమాకు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనేది చూడాలి. బడ్జెట్ లెక్కలు వేసుకోకుండా ఈ సినిమాను నిర్మించినట్లుగా నాగ్ అశ్విన్ చెప్పుకొచ్చాడు. మరో వైపు నాగ్ అశ్విన్ ఎప్పుడు కల్కి 2 సినిమాను చేస్తాడా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## ఈసారి సినిమా తీస్తే ఏం కట్ చేస్తావ్ బుచ్చిబాబు?

సుకుమార్ శిష్యుడిగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన బుచ్చిబాబు సానా.. తనకంటూ ఒక సెపరేట్ మార్క్ క్రియేట్ చేసుకున్నాడు. అతను రాసుకునే స్క్రీన్ ప్లే చాలా డేరింగ్ గా ఉంటుంది. ముఖ్యంగా తన సినిమాల్లో హీరో క్యారెక్టరైజేషన్ విషయంలో ఆయన తీసుకునే డెసిషన్స్ ఆడియన్స్ కు షాక్ ఇస్తుంటాయి. తన మొదటి సినిమాలో హీరోకి ఒక పెద్ద లోటు పెట్టి ఎమోషన్ పండించిన బుచ్చిబాబు.. లేటెస్ట్ గా వచ్చిన 'పెద్ది' సినిమాలో కూడా క్యారెక్టర్ పరంగా అలాంటి ఒక సాక్రిఫైస్ కే వెళ్లాడు. హీరోల శరీరంలో ఏదో ఒక భాగం కోల్పోయేలా కథ రాయడం అనేది బుచ్చిబాబు సెంటిమెంట్ లాగా మారిపోయిందని సోషల్ మీడియాలో మీమ్స్ కూడా వస్తున్నాయి. కథలో ఇంటెన్సిటీ పెంచడానికి ఆయన ఈ ఫార్ములాను వాడుతున్నప్పటికీ, ఆడియన్స్ మాత్రం దీనిపై ఫన్నీగా చర్చించుకుంటున్నారు. లేటెస్ట్ గా ఈ టాపిక్ పై సీనియర్ నటుడు జగపతిబాబు కూడా నేరుగా బుచ్చిబాబునే ఒక రేంజ్ లో ఆడుకోవడం విశేషం. 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ లో భాగంగా జగపతిబాబు, డైరెక్టర్ బుచ్చిబాబును ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడికి ఉన్న కటౌట్స్, క్రేజ్ చూసి "నెక్స్ట్ నువ్వు హీరోనా ఏంటి?" అని జగపతిబాబు సరదాగా అడిగారు. దానికి బుచ్చిబాబు సిగ్గుపడుతుండగానే.. సరే నువ్వు హీరో అయితే ఈసారి ఏం కట్ చేస్తావ్ అంటూ జగపతిబాబు ఊహించని పంచ్ వేశారు. ఈ ప్రశ్న అడగగానే బుచ్చిబాబు నవ్వు ఆపుకోలేకపోయాడు. హీరోగా నటించడంపై బుచ్చిబాబు చాలా ఓపెన్ గా తన ఒపీనియన్ చెప్పాడు. తనకు యాక్టింగ్ రాదని, సైడ్ లో నిలబడమని చిన్న క్యారెక్టర్ ఇచ్చినా తనకు చేతకాదని చాలా క్లియర్ గా ఒప్పేసుకున్నాడు. నటన అనేది తన కప్ ఆఫ్ టీ కాదని ఒక సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎలాంటి మొహమాటం లేకుండా ఒప్పుకోవడం హైలెట్. ఇక జగపతిబాబు అడిగిన 'కట్' ప్రశ్నకు కూడా బుచ్చిబాబు బదులిచ్చాడు. ఈసారి అలాంటి కోతలు ఏమీ ఉండవని,ఫుల్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్ తోనే సినిమా ఉంటుందని నవ్వుతూనే క్లారిటీ ఇచ్చాడు. దీన్ని బట్టి చూస్తే బుచ్చిబాబు తన నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం ఈ సెంటిమెంట్ ను పక్కనపెట్టి, పక్కా కమర్షియల్ స్క్రీన్ ప్లేను ట్రై చేయబోతున్నాడని అర్థమవుతోంది. హీరో పాత్రలకు ఇలాంటి లోపాలు పెట్టడం వల్ల ప్రేక్షకుల్లో సింపతీ ఈజీగా వస్తుంది. కథలోని ఎమోషన్ కు బాగా కనెక్ట్ అవుతారు. కానీ అదే ఫార్ములాను రిపీట్ చేస్తే రొటీన్ అయిపోతుంది. జగపతిబాబు లాంటి సీనియర్ నటుడే ఈ పాయింట్ ను హైలైట్ చేశాడంటే, ఇండస్ట్రీలో కూడా బుచ్చిబాబు మార్క్ స్క్రీన్ ప్లేపై ఎలాంటి డిస్కషన్స్ జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా తన తదుపరి ప్రాజెక్ట్ తో బుచ్చిబాబు ఎలాంటి మాస్ మ్యాజిక్ చేస్తాడో చూడాలి.

## 'వీరభద్రుడు' మూవీ రివ్యూ!

సూర్య కథానాయకుడిగా తమిళంలో నటించిన సినిమానే 'కరుప్పు'. తెలుగులో ఈ సినిమాను 'వీరభద్రుడు' టైటిల్ తో విడుదల చేశారు. ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. 130 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 300 కోట్లకి పైగా వసూలు చేయడం విశేషం. త్రిష .. ఆర్జే బాలాజీ ..శ్వాసిక కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజు నుంచి తమిళంతో పాటు ఇతర భాషల్లోను 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

మునుస్వామి (ఇంద్రన్) తన కూతురు 'మీను' (అనఘ మాయ)ను వెంటబెట్టుకుని సిటీకి వస్తాడు. ఆమె లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉంటుంది. లివర్ మార్పిడికి పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెబుతారు. అందువలన అతను తన దగ్గరున్న 60 సవర్ల బంగారాన్ని బ్యాంకులో పెట్టి డబ్బు తీసుకోవడం కోసం వస్తాడు. అయితే అతను ట్రైన్ దిగగానే దొంగలు ఆ నగలు కొట్టేసి పారిపోతారు. దాంతో తండ్రీ కూతుళ్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తారు.


పోలీసులు 45 సవర్ల బంగారాన్ని మాత్రమే రికవరీ చేయగలుగుతారు. ఆ నగలను కోర్టు ద్వారా తీసుకోమని చెబుతారు. ఆ కేసును లాయర్ బేబీ కృష్ణ (ఆర్జే బాలాజీ) తీసుకుంటాడు. కేసును ఎటూ తేల్చకుండానే బేబీ కృష్ణ టీమ్ తమ టిఫిన్ బిల్లులను మునుస్వామితో కట్టిస్తుంటారు. అలా 4 నెలలు గడిచిపోతుంది. 'మీను' ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుంది. అయినా తన బంగారం తన చేతికి రాకపోవడంతో మునుస్వామి విసిగిపోతాడు.

కోర్టుకి సమీపంలో ఒక వీరభద్రస్వామి గుడి ఒకటి ఉంటుంది. స్వామికి మనసులో మాట చెప్పుకుంటే, తప్పకుండా నెరవేరుతుందని మునుస్వామి వింటాడు. తన కూతురును కాపాడమని వేడుకుంటాడు. దాంతో నేరుగా వీరభద్రుడు (సూర్య) రంగంలోకి దిగుతాడు. నేరుగా బేబీ కృష్ణకి కనిపించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరిస్తాడు. దేవుడిలా అతీత శక్తులు చూపించకుండా, కోర్టుకు వచ్చి 'మీను'కి న్యాయం చేసి చూడమని అతను వీరభద్రుడికి సవాల్ విసురుతాడు. అప్పుడు వీరభద్రుడు ఏం చేస్తాడు? అవినీతి పరులపై ఎలా విరుచుకుపడతాడు? అనేది కథ.

సాధారణంగా ఎవరి చేతిలోనైనా మోసపోయినప్పుడు,మోసం చేసినవారికి తగిన గుణపాఠం చెప్పడానికి దేవుడు దిగివస్తే బాగుండునని చాలామంది అనుకుంటారు. మోసం చేసినవాళ్లు, తమని శిక్షించడానికి దేవుడు దిగివస్తాడా ఏంటి? అని నవ్వుకుంటారు. అయితే నిజంగానే దేవుడు దిగి వస్తే ఎలా ఉంటుందనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఆ దేవుడు కూడా ఒక మనిషి మాదిరిగానే ఎలా పరిస్థితులను చక్కదిద్దగలిగాడు? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ మలుపులు తీసుకుంటుంది.

ఈ కథ అంతా కూడా కోర్టు .. లాయర్ల చుట్టూ తిరుగుతుంది. కోర్టుకు ఒక ప్రొసీజర్ ఉంటుంది .. దేవుడు దిగివచ్చినా దానిని మార్చలేడు. మహిమలు లేకుండా మనిషిగా వచ్చి కోర్టు పరిధిలో న్యాయం జరిగేలా చూడమని కథానాయకుడిని ప్రతినాయకుడు సవాల్ చేయడమే ఈ కథలోని కీలకమైన మలుపుగా చెప్పుకోవాలి. శిక్షించడానికి వచ్చిన దేవుడికి పరీక్ష పెట్టడం ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. లాయర్ గా వీరభద్రుడు కోర్టుకు రావడం .. 'మీను' కేసును పరిష్కరించడం వరకూ బాగానే ఉంటుంది. ఆ తరువాత వీరభద్రుడి ప్రభావం కారణంగా, అసత్యాలు చెప్పాలనుకున్న వారు సైతం మాట తడబడిపోయి నిజాలు చెబుతూ ఉంటారు. దాంతో చకచకా కేసులు పరిష్కారమవుతూ ఉంటాయి. ఇక్కడే గ్రాఫ్ పడిపోయినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే ఈ అంశానికి సంబంధించిన సన్నివేశాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.

తండ్రీ కూతుళ్లు లాయర్ల ఉచ్చులో చిక్కుకోవడం ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అవుతుంది. న్యాయమూర్తులు .. న్యాయవాదులు .. పోలీసులు .. రౌడీలు కుమ్మక్కయితే ఒక సామాన్యుడికి ఆ దేవుడే దిక్కు అనే పాయింట్ ను టచ్ చేస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. దేవుడైనా సరే దిగివస్తే, మనుషుల చేతిలో మోసపోవలసిందే అనే విషయాన్ని ఆవిష్కరించిన విధానం మెప్పిస్తుంది. కష్టాల్లో ఉన్న ఒక వ్యక్తి కన్నీరు దొంగలను కదిలించి వేస్తుంది గానీ, పోలీసులు ..



లాయర్ల హృదయాలను కరిగించలేపోవడమనే సీన్ హైలైట్ గా నిలుస్తుంది.

ఈ సినిమాలో ఆశ్చర్యకరమైన విషయం ఒకటుంది. అది ఏంటంటే హీరో సూర్య ఎంట్రీ, మొదటి అరగంట దాటిన తరువాతనే ఉంటుంది.ఇక మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే లాయర్ వీరభద్రుడుగా వచ్చింది సాక్షాత్తు దేవుడని తెలిసిన ఆ విషయాన్ని విలన్ ఈజీగా తీసుకోవడం. ఇక వీరభద్రుడు .. ప్రీతీ ద్వారా పరిష్కరించే రెండో కేసుకు సంబంధించిన సీన్ అంతగా ఇంపాక్ట్ చూపలేకపోయింది.

ఎలాంటి అండదండలు లేనివారు తమకి ఏదైనా కష్టం వచ్చినప్పుడు పోలీసులను.. న్యాయవాదులను ఆశ్రయించవలసి వచ్చినప్పుడు, వాళ్లకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయనేది దర్శకుడు చూపించిన విధానం ఆసక్తికరంగా అనిపిస్తుంది. విష్ణు ఫొటోగ్రఫీ .. సాయి అభ్యంకర్ నేపథ్య సంగీతం . కలైవానన్ ఎడిటింగ్ ఫరవాలేదు. వీరభద్రుడిగా సూర్య లుక్ .. వీరభద్రస్వామి నేపథ్యంలో వచ్చే సీన్స్ .. అందుకు సంబంధించిన గ్రాఫిక్స్.. తండ్రీ కూతుళ్ల ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. కొన్ని సీన్స్ వాస్తవానికి చాలా దగ్గరగా వెళితే, మరికొన్ని సన్నివేశాలు చాలా తేలికగా తేలిపోతూ ఉంటాయి. బలమైన కొన్ని సన్నివేశాలు మాత్రమే బాగున్నాయని అనిపిస్తుంది అంతే.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: కరుప్పు
విడుదల తేదీ: 2026-06-12
తారాగణం: సూర్య, త్రిష,
జీ బాలాజీ, ఇంద్రన్స్, నట్టి, స్వసిక
దర్శకుడు: ఆర్జే బాలాజీ
సంగీతం: సాయి అభ్యంకర్
బ్యానర్: డ్రీమ్ వారియర్ పిక్చర్స్
సమీక్ష: పెద్దింటి
కరుప్పు రేటింగ్: 5కి 2.50

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662